క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



స్వామిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కడియం: రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పూళ్ల రామలింగేశ్వరస్వామి (పీఎల్ఆర్ స్వామి)ని మంగళవారం స్థానిక హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పీఎల్ఆర్ స్వామి బయాలజీ టీచర్ అయినప్పటికీ తెలుగుపై మక్కువతో ఈతరం వారికి ఆసక్తి కలిగించేలా కవితలు రాశారన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర పనుల కోసం నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మల్లయ్యపేట సబ్‌స్టేషన్ పరిధిలోని ఆర్అండ్‌బీ వాంబే గృహాలు, రాజీవ్ గాంధీ కాలనీ, మున్సిపల్ కాలనీ, రత్నంపేట, కోరుకొండ రోడ్ రాజా థియేటర్ ఏరియాల్లో విద్యుత్ ఉండదు.

- ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ మార్కెట్ యార్డ్ సబ్‌స్టేషన్ పరిధిలోని వీరభద్రపురం, జయకృష్ణాపురం, ఇన్‌కమ్ టాక్స్ ఆఫీస్, కోరుకొండ రోడ్డు, హరిపురం ఏరియాల్లో అంతరాయం కలుగుతుంది.

3న శిష్టకరణ వనసమారాధన

మధురపూడి: శిష్టకరణ సేవాసమితి ఆధ్వర్యంలో మధురపూడి విమానాశ్రయం సమీపంలోని పుల్లయ్యతోటలో డిశంబర్ 3వ తేదీన కార్తిక సమారాధన, సర్వసభ్య సమావేశం జరగనుంది. ఉదయం 6.30 గంటలకు రమా వీర వెంకట సత్యనారాయణస్వామి వ్రతం, కార్తిక దామోదరుని పూజతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. 8 గంటలకు అల్పాహారం, అనంతరం ఆటల పోటీలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు భోజనాలనంతరం సర్వసభ్య సమావేశం జరుగుతుంది. అధ్యక్షుడి తొలి పలుకులు, కోశాధికారి నివేదిక, బహుమతుల ప్రదానం, సాయంత్రం 5 గంటలకు వందన సమర్పణతో కార్యక్రమం ముగుస్తుంది.

3 నుంచి వికసిత్ యాత్ర

కడియం: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై మండల స్థాయి నోడల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో రత్నకుమారి సమీక్షించారు. మండల పరిధిలో డిసెంబరు 3 నుంచి 6వ తేదీ వరకూ యాత్ర జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ రకాల పథకాల అమలుపై సంచార వాహనం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ మేరకు గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కమిటీ చైర్మన్‌గా గ్రామ సర్పంచ్, ప్రతి గ్రామానికి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తామని తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఆయా గ్రామాల పరిధిలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. డీఎల్‌డీవో పి.వీణాదేవి, తహసీల్దార్ సుజాత పాల్గొన్నారు.

15 నుంచి ఆడుదాం ఆంధ్ర పోటీలు



స్పోర్ట్స్ కిట్లను ఆవిష్కరిస్తున్న శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, చిత్రంలో అధికారులు

కడియం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు డిసెంబర్ 15 నుంచి సచివాలయ స్థాయిలో ప్రారంభమవుతాయని శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర తెలిపారు. ఈ మేరకు స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంపీడీవో కె.రత్నకుమారి అధ్యక్షతన స్పోర్ట్స్ కిట్స్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. క్రీడా పోటీల వివరాలు, షెడ్యూల్‌ను ఎంపీడీవో వెల్లడించారు. 15 ఏళ్లు నిండిన ఎవరైనా ఈ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలు ఉంటాయని తెలిపారు. డిసెంబర్ 15 నుంచి 20 వరకూ సచివాలయం స్థాయిలో, డిసెంబర్ 21 నుంచి జనవరి 4 వరకు మండల స్థాయిలోనూ, జనవరి 11 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలోనూ, జనవరి 22 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయిలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో వీణాదేవి, ఎంఈవో వి.లజపతిరాయ్, ఈవోపీఆర్‌డీ వైవీవీఎస్ఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

సమ్మేటివ్ -1 పరీక్షలు ప్రారంభం

ప్రకాశం నగర్: సమ్మేటివ్ -1 పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ తెలిపారు. ప్రశ్నపత్రాల బండిల్స్‌ను పరీక్ష ప్రారంభానికి ఒక గంట ముందు స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టోరేజ్ పాయింట్ నుంచి ప్రధానోపాధ్యాయులకు అందజేశామన్నారు. పరీక్షలను అత్యంత సమర్థంగా నిర్వహించాలని, సమస్యలు ఎదురైతే వెంటనే తమ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. సీఆర్‌పీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి సత్యప్రసాద్, కుమారి, ఇందిర, కొటేశ్వరి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఫూలే సేవలు స్ఫూర్తిదాయకం

- ఎంపీ భరత్ రామ్
- ఫూలే విగ్రహానికి నివాళి



ఫూలే విగ్రహానికి నమస్కరిస్తున్న ఎంపీ భరత్ రామ్ తదితరులు

సీటీఆర్ఐ: మహాత్మా జ్యోతిరావు ఫూలే, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ఉద్యమించాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ పిలుపునిచ్చారు. ఫూలే సంస్మరణ దినోత్సవాన్ని గోదావరి గట్టున గల ఆయన విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించారు. నయనాల కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీ భరత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఫూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాల దాటుతున్న బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక పరంగా న్యాయం జరగకపోవడానికి పాలకుల స్వార్థమే కారణమన్నారు. ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జన గణన చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, కుల గణన కూడా చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సాహసోపేత నిర్ణయంతో రాష్ట్రంలో కులగణన ప్రక్రియ జరగనుందన్నారు. రాష్ట్రంలో రాజకీయంగా బడుగు, బలహీన వర్గాలకు సీఎం జగన్ న్యాయం చేశారని తెలిపారు. అనంతరం ఫూలే, అంబేడ్కర్ సామాజిక భవన నిర్మాణ పనుల పురోభివృద్ధిని ఎంపీ భరత్ పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మార్గాని సురేష్, కడియాల లక్ష్మణరావు, మజ్జి అప్పారావు, దుంగ మంగ, ఏపీ రమణ పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనే లక్ష్యం

రాజమహేంద్రవరం రూరల్: ఫూలే, అంబేడ్కర్ భావజాలంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సమ సమాజ స్థాపనే లక్ష్యంగా పాలన అందిస్తున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో మంగళవారం ఫూలే వర్ధంతి నిర్వహించారు. రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, బీసీ నాయకులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు.. ఫూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించాయి. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు రాజ్యాధికారం అందినప్పుడే ఫూలేకు నిజమైన నివాళులు అర్పించినట్టు అన్నారు. సీఎం జగన్ ఆ దిశగా అడుగులు వేశారని, అందులో భాగంగానే కులగణన కార్యక్రమం ఎంతో సాహసోపేతంగా రాష్ట్రంలో చేపట్టారని చెప్పారు. సభలో మార్గాని నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం ముగ్గురికి రూ.3.95 లక్షలు విలువజేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ భరత్ అందజేశారు. కార్యక్రమంలో మజ్జి అప్పారావు, దుంగా మంగ, టీకే విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎంపీ భరత్ రామ్



వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో ఫూలే వర్ధంతి

స్ఫూర్తి ప్రదాత

ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఆదేశాల మేరకు మంగళవారం వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో ఫూలే వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, పార్టీ జిల్లా కార్యదర్శులు తాటికొండ విష్ణు, కొప్పినీడి ప్రసాద్ బాబు (రాజమౌళి), వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ షట్టర్ బాషా, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, పార్టీ నాయకులు అంగాడ సత్యప్రియ, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, తలారి వరప్రసాద్, పెనుమాక సునీల్, మారిశెట్టి వెంకన్న, ధర్మ పాల్గొన్నారు.

- బొమ్మూరు జీపీఆర్ హైస్కూల్లో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఫూలే చిత్రపటానికి గ్రామ అధ్యక్షుడు యెనుముల త్యాగరాజు, మత్స్యేటి శివ పూలమాల వేసి నివాళులర్పించారు. ఫూలేను నేటి తరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రీజినల్ కోఆర్డినేటర్ నాగులపల్లి ఆశ, మాజీ ఉపసర్పంచ్ దాకే శ్రీనివాస్, పార్టీ నాయకులు సద్గుణ రామారెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ కాకులపాటి కుమార్ పాల్గొన్నారు.
- బొమ్మూరులోని 220 కేవీ సబ్ స్టేషన్‌లో ఏపీ ట్రాన్స్‌కో డీఈఈ రాయుడు రమేష్ బాబు ఆధ్వర్యంలో ఫూలే వర్ధంతి నిర్వహించారు. బొమ్మూరులోని ఫూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ నాగవేణి పుష్పాంజలి ఘటించారు.

ప్రతి ఇంటిలో నవరత్నాల వెలుగులు

- జగన్ పాలనపై ప్రజలందరి హర్షం
- సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్



డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న పాలిక శ్రీను, రాజమౌళి

రాజమహేంద్రవరం సిటీ: ప్రతి ఇంటిలోనూ జగనన్న అమలు చేసిన నవరత్నాల వెలుగులు విరజిమ్ముతున్నాయని, అందుకే ఆయనను సీఎంగా మళ్లీ గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని పలు సచివాలయాల్లో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సాధికారతే లక్ష్యంగా జగనన్న విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టి, నవరత్నాల పేరిట పథకాలు అమలు చేశారన్నారు. 43వ డివిజన్ మల్లికార్జున్ నగర్ 76వ సచివాలయంలో రూ.15.86 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యాయని, సుమారు 4.96 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. 9వ డివిజన్ కోకా భాస్కరమ్మ నగర్ 16వ నంబర్ సచివాలయంలో రూ.10.53 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాగా, సుమారు రూ.46 లక్షలతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. 22వ డివిజన్ వంకాయలవారి వీధి 52వ సచివాలయంలో దాదాపు రూ.13.04 కోట్లు లబ్ధిదారులకు, రూ.4.69 కోట్లు అభివృద్ధి పనులకు విడుదలయ్యాయన్నారు. 40వ డివిజన్ 68వ సచివాలయంలో రూ.26 కోట్ల మేర లబ్ధిదారులకు, రూ.3.87 కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమాల్లో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ నాయకులు మజ్జి అప్పారావు, అర్జరపు వాసు, పెంకే సురేష్, పోలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు

రాజమహేంద్రవరం రూరల్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను అన్నారు. స్థానిక 16వ డివిజన్ ఆదర్శనగర్‌లోని 41వ సచివాలయం (ఆవ వాంబేకాలనీ)లో మంగళవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆయన, రూరల్ డివిజన్ల జేసీఎస్ ఇన్‌చార్జి కొప్పినీడి ప్రసాద్‌బాబు(రాజమౌళి), సచివాలయ కన్వీనర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత పూర్తిస్థాయిలో అవినీతి రహిత పాలన సాగుతోందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు ఏర్నాగుల జయలక్ష్మి, సూర్యకళ, ఉమ, అనురాధ, సబ్బెళ్ల దుర్గారెడ్డి, నాగేంద్ర బాబు, గోపీ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో లాభాలు



శిక్షణకు హాజరైన ఉద్యాన సిబ్బంది, చిత్రంలో శాస్త్రవేత్తలు

కడియం: పువ్వులు, నర్సరీ మొక్కల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు అనుసరించడం ద్వారా రైతులకు లాభాలు సమకూరుతాయని వేమగిరిలోని డీఎఫ్ఆర్‌సీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డీవీఎస్ రాజు అన్నారు. డీఎఫ్ఆర్‌సీ, జిల్లా ఉద్యాన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జెడ్‌బీఎన్ఎఫ్, ఉద్యాన అధికారులు, ఉద్యాన విస్తరణాధికారులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం వేమగిరిలోని డీఎఫ్ఆర్‌సీలో మంగళవారం జరిగింది. లాభదాయక యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణలో అనుసరించాల్సిన విధానాలపై శిక్షణ ఇచ్చారు. డాక్టర్ రాంపాల్ ఆర్కిడ్స్ రకాల సాగు, నైపుణ్యాలను వివరించారు. నులి పురుగుల నివారణకు అనుసరించాల్సిన పద్ధతులను డాక్టర్ శిరీష తెలిపారు. డాక్టర్ మాధవ్ మాట్లాడుతూ కనకాంబరం, చామంతి, నర్సరీ మొక్కలకు వ్యాపించే బ్యాక్టీరియా, ఫంగస్ తెగుళ్ల నివారణా చర్యలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖాధికారి బి.సుజాత కుమారి, ఏపీ సీఎస్ఎఫ్‌పీఎం తాతారావు, హెచ్‌వో సుదీర్ కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- ఉత్సాహంగా గడప గడపకూ..



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందజేస్తామని, స్థలానికి హామీ పత్రం పొందిన ప్రతి లబ్ధిదారుడికీ తానే ఇంటి పట్టా ఇస్తానని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 32వ డివిజన్‌లో ఇన్‌చార్జి ముప్పన శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, క్షేత్రస్థాయి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో చాలా మందికి ఇళ్ల పట్టాలుగా జగనన్న కాలనీలలో హామీ పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలకు మేలుకు జరుగుతుందంటే కంటగింపుగా ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు కోర్టుకెళ్లి అడ్డుపుల్లలు వేయడంతో పట్టాల పంపిణీ ఆలస్యమైందన్నారు. కోర్టులో విషయం తేలిన వెంటనే.. హామీ పత్రాలు ఉన్న అందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి నెలాఖరుకు 4.18 లక్షల పేదల ఇళ్లను పూర్తి చేసేలా జగనన్న ఆదేశించారన్నారు. ఈ మేరకు ఫిబ్రవరిలో భారీగా సామూహిక గృహప్రవేశాలు జరగనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగరపాలక సంస్థ ఉద్యోగులు, వలంటీర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై సమావేశం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత మంగళవారం వివిధ బీమా సంస్థల ప్రతినిధులు, ఆ సంస్థల న్యాయవాదులతో సమావేశమయ్యారు. డిసెంబర్ 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసులను పరిష్కరించేందుకు, బాధితులకు తగు పరిహారం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. పెండింగ్‌లో ఉన్న మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసులను గుర్తించి, ఆ జాబితాను జిల్లా న్యాయసేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. త్వరలో నిర్వహించనున్న ముందస్తు లోక్ అదాలత్ సమావేశాల్లో బీమా సంస్థలు, యాక్సిడెంట్ కేసుల్లోని బాధితులు, ఇరు పక్షాల న్యాయవాదులు పాల్గొనాలన్నారు.

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని, గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై దృష్టి సారించి, తగిన విధంగా వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మాతా, శిశు మరణాల నివారణ, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు, సామాజిక ఆరోగ్య కేంద్రాల ఏరియా హాస్పిటల్లోని గైనకాలజిస్టులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో హైరిస్క్ ప్రెగ్నెన్సీపై ఇంటిగ్రేటెడ్ హైరిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్మెంట్ అండ్ ట్రాకింగ్‌పై మొదటి రోజు శిక్షణ పూర్తి చేశామన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.రాజకుమారి మాట్లాడుతూ పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యులకు రెండు రోజుల పాటు ఈ శిక్షణ జరుగుతుందన్నారు. ప్రమాద స్థితిలో ఉన్న గర్భిణులను గుర్తించి, వారికి తగిన విధంగా వైద్య పరీక్షలు సూచనలు సలహాలు ఇచ్చి, మాతా, శిశు మరణాలను సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్మాన్ సంస్థ మెడికల్ ట్రైనింగ్ ఆఫీసర్ డాక్టర్ వి.సౌజన్య శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, డీపీహెచ్‌ఎన్‌ఓ వసంత, సీహెచ్‌ఓ శాస్త్రి, ఎంపీహెచ్‌వో బాపిరాజు పాల్గొన్నారు.

సీహెచ్‌వోలు విధుల్లో చేరాలి

రాజమహేంద్రవరం రూరల్: సామాజిక ఆరోగ్యాధికారులు (సీహెచ్‌వో/ఎంఎల్‌హెచ్‌పీ) వెంటనే తమ ఆందోళనను విరమించుకుని ప్రజారోగ్య పరిరక్షణా విధుల్లో చేరాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలియజేశారన్నారు. నిర్లక్ష్యం వహిస్తే వేతనాలను నిలుపు చేయటంతో పాటు విధుల నుంచి తొలగించే అధికారం ఉంటుందన్నారు.సీహెచ్‌వోలు తమకు నిర్దేశించిన విధంగా ప్రధాన కేంద్రంలో అందుబాటులో వుండి పాము కాటు, వడదెబ్బ వంటి అత్యవసర సేవలను అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కొనసాగిస్తున్నందున ఇందులో ఉద్యోగాల రెగ్యులరైజేషన్ ప్రశ్నే తలెత్తదని కమిషనర్ వారికి స్పష్టం చేశారన్నారు. వారికి చెల్లిస్తున్న వేతనాలు, మన రాష్ట్రంలోనే అధికంగా ఉన్నాయన్నారు.

బంగారు ఆభరణాల దొంగ అరెస్టు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇళ్లలో ఒంటరిగా ఉన్న వృద్ధులను బెదిరించి, వారి దగ్గర బంగారం వస్తువులు చోరీ చేస్తున్న వ్యక్తిని వన్‌టౌన్ లాఅండ్ ఆర్డర్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 32 గ్రాముల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం వన్‌టౌన్ లాఅండ్‌ఆర్డర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 19వ తేదీన జరిగిన ఇంటి చోరీపై ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.విజయపాల్ ఆధ్వర్యంలో క్రైమ్ సిబ్బంది ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పక్కా సమాచారం మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలోని గోదావరిగట్టు మార్కండేయ స్వామి గుడి సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రావులపాలేనికి చెందిన వాడవిల్లి సతీష్ మోటార్ సైకిల్‌పై వస్తూ.. పోలీసులను చూసి వెనుకకు పారిపోబోయాడు. వన్‌టౌన్ లాఅండ్‌ఆర్డర్ ఎస్సై జే.ఆదినారాయణ, సీసీఎస్ అధికారులు, సిబ్బందితో కలిసి అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడు గడచిన పది రోజుల్లో వన్‌టౌన్, ప్రకాశం నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇంటిలో ఒంటరిగా వున్న వృద్ధులను బెదిరించి, బంగారపు వస్తువులు చోరీచేసినట్లు అంగీకరించాడు. అతడి నుంచి రికవరీ చేయబడిన 32 గ్రాముల బంగారం విలువ రూ.1,60,000 ఉంటుందని డీఎస్పీ విజయపాల్ తెలిపారు.

శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజుకు అభినందనలు



మోషేన్‌రాజును అభినందిస్తున్న గిరజాల బాబు, స్టాలిన్ తదితరులు

కడియం: రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పుట్టినరోజును పురస్కరించుకుని కడియం మండలం నుంచి పలువురు నాయకులు భీమవరం వెళ్లి ఆయనకు అభినందనలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పెద్దాపురం నియోజకవర్గం పరిశీలకులు గిరజాల వీర్రాజు (బాబు), కడియ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, మాజీ కో ఆప్షన్ సభ్యుడు సర్కార్ బాషా, పార్టీ నాయకులు పున్నమిరాజు వీర్రాజు తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

గ్రామ సర్వేయర్ల రాష్ట్ర కోఆర్డినేటర్‌గా సత్యనారాయణ



రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ గ్రామ సర్వేయర్ల సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా రూరల్ మండలం వెంకట నగరం సర్వేయర్ సూరిశెట్టి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఎన్జీవో హోంలో సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుబాబు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో సత్యనారాయణను ఎన్నుకున్నారు. అలాగే సంఘం జిల్లా కోఆర్డినేటర్‌గా అనపర్తికి చెందిన వినోద్ కుమార్ ఎంపికయ్యారు.

వెయిల్ లిఫ్టింగ్ పోటీలకు అదీప్

ప్రకాశం నగర్: జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ అండర్ – 17 పోటీలకు ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి మైలిపిల్లి సంజయ్ అదీప్ ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. కర్నూలులో ఈ నెల 23 నుంచి 25 వరకూ జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 180 కేజీల విభాగంలో అదీప్ ప్రథమస్థానంలో నిలిచాడన్నారు. త్వరలో బీహార్‌లో జరిగే జాతీయ పోటీలకు హాజరవుతాడన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

రాజమహేంద్రవరం సిటీ: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ లంక సత్యనారాయణ అన్నారు. స్థానిక బాలసదనంలో బాలికలకు మంగళవారం స్వెట్టర్లు పంపిణీ చేశారు. పమిడి పల్లి కోటేశ్వరావు, వై.సూరిబాబు, కాలెపు భద్రరావు పాల్గొన్నారు.

న్యాయవాది రామలింగారెడ్డికి ప్రశంసాపత్రం



జ్ఞాపికను అందుకుంటున్న రామలింగారెడ్డి

ప్రకాశం నగర్: న్యూఢిల్లీలో ఈనెల 24, 25 తేదీల్లో కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్ (అస్రా) ఐదో జాతీయ సదస్సులో జిల్లాకు ప్రత్యేక గౌరవం దక్కిందని ఏపీ స్టేట్ లీగల్ కో ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న న్యాయవాది పులగం రామలింగ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని 12 రాష్ట్రాలతో పాటు అమెరికా, దక్షిణ కొరియా, దుబాయ్ దేశాల నుంచి వచ్చిన అస్రా ప్రతినిధుల చేతుల మీదుగా తాను ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరఫున రోహిత్ సింగ్, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రిత్వశాఖ కార్యదర్శి హాజరయ్యారన్నారు.

నేడు నన్నయలో సెమినార్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో సొసైటీ ఫర్ కమ్యూనిటీ రీసెర్చ్ ఇన్ యాక్షన్ (ఎస్‌సీఆర్‌ఏ) యూఎస్ఏ ఆధ్వర్యంలో రెండు రోజుపాటు జరిగే అంతర్జాతీయ సెమినార్ బుధవారం ప్రారంభం కానుంది. స్పృహ సైకాలజీ అలుమ్నీ అసోసియేషన్, రోటరీ డిస్ట్రిక్ట్ 3020, డిపార్టుమెంట్ ఆఫ్ సైకాలజీ, జీఎస్ఎల్ సంయుక్త సహకారంతో 'గ్లోబల్ పీస్ అండ్ హెల్త్ మ్యార్జినైజేషన్ – ఎ కమ్యూనిటీ పెర్‌స్పెక్టివ్' అనే అంశంపై ఈ సెమినార్ జరగనుంది. విశ్వశాంతికి వ్యక్తిగత, సామాజిక, ఆరోగ్యకర జీవన విధానానికి కమ్యూనిటీ సైకాలజీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వీసీ ఆచార్య కె. పద్మరాజు అన్నారు.

ఫర్నీచర్ క్లస్టర్ పనులు వేగవంతం చేయాలి

రంగంపేట: జిల్లాలో ఫర్నీచర్ మ్యానుఫ్యాక్చర్ క్లస్టర్ యూనిట్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని వడిశలేరులో ఫర్నీచర్ మానుఫ్యాక్చర్ క్లస్టర్ ఏర్పాటుచేయనున్న ప్రాంతాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అత్యాధునిక సాంకేతిక నిపుణులతో కలిగిన ఫర్నీచర్ అందుబాటులో తీసుకొచ్చేందుకు ఔత్సాహిక ఎస్‌పీవీల 10 శాతం భాగస్వామ్యంతో ప్రభుత్వం 20 శాతం గ్రాంట్‌తో చర్యలు తీసుకుందన్నారు. ఇప్పటికే 110 మంది ద్వారా ఎస్‌పీవీల కంట్రిబ్యూషన్ 10 శాతం చెల్లించగా, ప్రభుత్వం తన వాటాగా 20 శాతం విడుదలకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. క్లస్టర్ స్ట్రక్చరల్ నిర్మాణాల విషయంలో రానున్న 10 రోజుల్లో పనులు ప్రారంభించి, నెల రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు.